క్లుప్తంగా

ఆర్థిక భద్రతకు మహిళా సమ్మాన్



మహిళా సమ్మాన్ మేళాలో ఖాతాలు తెరిచిన మహిళలు

మండపేట: మహిళల ఆర్థిక భద్రతకు మహిళా సమ్మాన్ సేవింగ్స్ పథకం తోడ్పాటునందిస్తుందని రామచంద్రపురం సబ్ డివిజనల్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఎం.లక్ష్మణ్‌కుమార్ అన్నారు. స్థానిక హెడ్ పోస్టాఫీసులో మంగళవారం ఏర్పాటు చేసిన మహిళా సమ్మాన్ మేళాకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఈ పథకం ప్రయోజనాలను వివరించారు. 29వ వార్డు కౌన్సిలర్ పిల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ అధిక వడ్డీని ఇచ్చే పోస్టల్ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సబ్ పోస్టుమాస్టర్ ఎస్.శ్రీనివాసరెడ్డి అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో శ్రీ వీరాంజనేయ దేవస్థానం చైర్మన్ సూరంపూడి సత్యప్రసాద్ పాల్గొన్నారు.

మండల విద్యాశాఖాధికారి-2గా జాన్



బాధ్యతలు చేపట్టిన జాన్

కాజులూరు: మండల విద్యాశాఖాధికారిగా -2గా పులపకూర జాన్ నియమితులయ్యారు. పాఠశాలల్లో విద్యాప్రమాణాలు మెరుగుపరచే కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ప్రతీ మండలానికి అదనపు విద్యాశాఖాధికారి పోస్టులను మంజూరు చేసింది. దీనిలో భాగంగా యు.కొత్తపల్లి మండలం కొండేవరం జెడ్పీ హైస్కూల్లో ప్రధానోపాధ్యాయునిగా పనిచేస్తున్న పులపకూర జాన్‌కు పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం కాజులూరు మండల విద్యాశాఖాధికారి -2గా బదిలీ చేసింది. ఎంఈఓ కేవీవీ సత్యనారాయణ సమక్షంలో ఆయన మంగళవారం బాధ్యతలు చేపట్టారు.

ఎంఈఓగా వివేకానంద

రాయవరం: మండల విద్యాశాఖాధికారిగా కె.వివేకానంద నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఎంఈవోగా విధులు నిర్వర్తించిన వై.సత్యనారాయణ సాధారణ బదిలీల్లో భాగంగా బదిలీపై తాళ్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లారు. దీంతో రామచంద్రపురం ఎస్‌కేవీపీజీఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా ఉన్న వివేకానందకు రాయవరం మండల విద్యాశాఖాధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు కేటాయించారు.

తాపీ మేస్త్రీ సంఘం నేత చిన్నబ్బులు మృతి



చిన్నబ్బులు (ఫైల్)

మండపేట: స్థానిక తాపీ మేస్త్రీ సంఘం నాయకుడు పాలమూరి చిన్నబ్బులు (90) మంగళవారం కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్ద తుది శ్వాస విడిచారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. 1975లో పట్టణంలో తాపీమేస్త్రీ సంక్షేమ సంఘం ఏర్పాటులో చిన్నబ్బులు ముఖ్యపాత్ర పోషించి సంఘ ఉపాధ్యక్షునిగా పనిచేశారు. ఆయన మృతికి సంతాపంగా మంగళవారం భవన నిర్మాణ కార్మికులు పనులు నిలిపివేశారు.

పరస్పర ఫిర్యాదులపై కేసుల నమోదు

రాయవరం: పరస్పర ఫిర్యాదులపై కేసులు నమోదు చేసినట్లు రాయవరం ఎస్సై పీవీవీఎస్ఎన్ సురేష్ తెలిపారు. మండలంలోని సోమేశ్వరం గ్రామానికి చెందిన కుటుంబ సభ్యులైన మన్నె నారాయణమూర్తి, మన్నె వీరన్న సరిహద్దు విషయమై తగవులు పడ్డారన్నారు. మన్నె నారాయణమూర్తి బీరు సీసాతో వీరన్నపై దాడి చేయగా, ఎడమ చేతి ఉంగరం వేలుకు గాయమైందన్నారు. అలాగే వీరన్న కొడవలితో నారాయణమూర్తిపై దాడి చేయగా ఎడమ చేతికి గాయమైందన్నారు. ఇద్దరిని బంధువులు రామచంద్రపురం ఏరియా ఆస్పత్రిలో చేర్పించారన్నారు. ఇద్దరి ఫిర్యాదులపై కేసులు నమోదు చేసినట్లు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

ఏరియా ఆసుపత్రిలో మరిన్ని సేవలు

- రూ.6.50 కోట్లతో అభివృద్ధి
- అదనంగా 30 పడకలు
- త్వరలో అందుబాటులోకి..



మూడు అంతస్తుల్లో నిర్మించిన ఏరియా ఆసుపత్రి భవనం

రామచంద్రపురం: 'ప్రాణం విలువ ఏంటో నాకు తెలుసు' అని చెప్పిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదవాడికి కార్పొరేట్ వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. మూడు నియోజకవర్గాలకు కేంద్రంగా ఉన్న రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో అన్ని రకాల సేవలు అందుబాటులో ఉండే విధంగా నిధులు కేటాయిస్తూ పేదలకు వైద్యాన్ని అందిస్తున్నారు.

మూడు నియోజకవర్గాలకు ఒకటే...

రామచంద్రపురంతో పాటుగా, అనపర్తి, మండపేట నియోజకవర్గాలకు ఏరియా ఆసుపత్రి ద్వారా సేవలను అందిస్తున్నారు. సుమారు 20 ఏళ్ల క్రితం 100 పడకల ఆసుపత్రిని పట్టణంలో నిర్మించారు. అప్పట్లో కొన్ని విభాగాల్లో మాత్రమే వైద్య సేవలు అందించేవారు. క్రమంగా ఏరియా ఆసుపత్రిలో సేవలను మెరుగుపర్చారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఏరియా ఆసుపత్రి అభివృద్ధి పథంలో సాగుతోంది.

సేవలు మెరుగు

ప్రస్తుతం ఏరియా ఆసుపత్రిలో రెండస్తులతో ఉంది. 100 పడకలతో రోగులకు సేవలందిస్తున్నారు. మూడు నియోజకవర్గాలకు అతిపెద్ద ఆసుపత్రి కావటంతోపాటు సేవలు మెరుగుపడడంతో ఏటా ఆసుపత్రికి వచ్చే వారి సంఖ్య పెరుగుతోంది. రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఏరియా ఆసుపత్రి అభివృద్ధిపై దృష్టి సారించారు. మూడవ అంతస్తు వేసి అందులో మరిన్ని సేవలను రోగులకు అందుబాటులోకి తేవాలని నిర్ణయించి ప్రభుత్వం నుంచి రూ. 6.50 కోట్లు తీసుకువచ్చి ఆసుపత్రి అభివృద్ధికి శ్రీకారం చుట్టారు.

పడకల కొరత తీర్చేందుకు..

ప్రస్తుతం ఏరియా ఆసుపత్రిలో మూడు విభాగాలుగా 100 పడకలతో ఆసుపత్రిలో వైద్య సేవలను అందిస్తున్నారు. ఇటీవల కాలంలో ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసూతి కేసులు అధికంగా నమోదు కావటంతో పడకల కొరత ఏర్పడుతోంది. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని మూడవ అంతస్తులో అదనంగా 30 పడకలను కూడా ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకున్నారు. కోవిడ్ సమయంలో ఆసుపత్రిలో 25 ఆక్సిజన్ బెడ్లు ఏర్పాటు చేశారు. 12 మంది వివిధ విభాగాల వైద్యులతో పాటుగా సుమారు 70 మంది వైద్య సిబ్బంది ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. కంటి వైద్యానికి సంబంధించి ప్రత్యే విభాగాన్ని ఏర్పాటు చేయటమే కాకుండా కంటి శస్త్రచికిత్సలను కూడా అందిస్తున్నారు. కొంతకాలంగా జరుగుతున్న నిర్మాణ పనులు పూర్తికావచ్చాయి. త్వరలోనే మెరుగైన సేవలతో నూతన ఏరియా ఆసుపత్రిలో సేవలు విస్తృతం కానున్నాయి.

ప్రజారోగ్య రక్షణే ప్రథమ కర్తవ్యం



ఏరియా ఆసుపత్రి ద్వారా అందరికీ అన్ని రకాల వైద్యం అందించేందుకు కృషి చేస్తున్నాం. అందులో భాగంగానే ప్రభుత్వం రూ.6.50 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. నియోజకవర్గంతో పాటుగా అనపర్తి, మండపేట ప్రజలు ఇక్కడ వైద్యానికి వస్తున్నారు. ప్రజారోగ్య రక్షణే మా ప్రభుత్వం ప్రథమ కర్తవ్యంగా భావిస్తూ ఆసుపత్రిలో మరిన్ని సేవలను అందుబాటులోకి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నాం.

– చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, బీసీ సంక్షేమశాఖ మంత్రి

ఆసుపత్రి సేవలను వినియోగించుకోవాలి



ప్రభుత్వం కల్పిస్తున్న వివిధ పథకాల మూలంగా ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య పెరుగుతున్న దృష్ట్యా ఆసుపత్రిని విస్తరించేందుకు నిధులను కేటాయించి అభివృద్ధి చేయటం అభినందనీయం. ప్రజలు ఏరియా ఆసుపత్రిలో సేవలను వినియోగించుకోవాలి.

– కంచుమర్తి బాబూరావు, జాతీయ మానవహక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు

జగనన్న పాలవెల్లువ పథకాన్ని విజయవంతం చేయాలి



వెంటూరులో ఏర్పాటైన మహిళా డెయిరీ అసోసియేషన్ సభ్యులు

రాయవరం: జగనన్న పాలవెల్లువ పథకాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ నౌడు వెంకటరమణ పిలుపునిచ్చారు. మండలంలోని వెంటూరు సచివాలయం వద్ద మంగళవారం మహిళా డెయిరీ అసోసియేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. సర్పంచ్ వాసంశెట్టి వెంకటరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీపీ వెంకటరమణ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా పాడి రైతులను ప్రోత్సహించేందుకు డెయిరీ అసోసియేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసిందన్నారు. 58 మంది మహిళా రైతులతో సమావేశం ఏర్పాటు చేయగా, కోట భార్గవలక్ష్మి చీఫ్ ప్రమోటర్‌గా, వాసంశెట్టి వీరవెంకటలక్ష్మి ప్రమోటర్‌గా, కుప్పాల భవ్యశ్రీ సెక్రటరీగా ఎన్నికయ్యారు. ఎంపీడీవో కొవ్వూరి నరేంద్రరెడ్డి, ఉప సర్పంచ్ నున్న కృష్ణప్రదీప్‌కుమార్, వైస్ ఎంపీపీ గుబ్బల సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ సభ్యుడు వాసంశెట్టి విజయకుమార్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ విజయ, పంచాయతీ విస్తరణాధికారి కరుణాకర్ పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

- చైర్‌పర్సన్ దుర్గారాణి
- వార్డు పర్యటనలకు శ్రీకారం



పారిశుధ్య నిర్వహణపై స్థానికులతో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ దుర్గారాణి, కమిషనర్ రామ్‌కుమార్

మండపేట: రానున్న వర్షాకాలం దృష్ట్యా పట్టణంలో మెరుగైన పారిశుధ్య నిర్వహణ లక్ష్యంగా మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి వార్డు పర్యటనలకు శ్రీకారం చుట్టారు. ప్రతీ రోజు ఉదయాన్నే ప్రజాప్రతినిధులు, మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో కలిసి వార్డు పర్యటనలు చేయనున్నారు. అందులోభాగంగా మంగళవారం 2వ వార్డులో కౌన్సిలర్ చిట్టూరి సతీష్‌తో కలిసి వార్డు పర్యటన ప్రారంభించారు. బ్యాంకు కాలనీలోని పలు వీధుల్లో తిరిగి పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. చెత్త సేకరణ, పారిశుధ్య నిర్వహణపై స్థానికులను అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. స్థానికులు తెలిపిన సమస్యలపై అక్కడికక్కడే మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లావణ్య తదితరులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ దుర్గారాణి మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఎటువంటి పారిశుధ్య సమస్యలున్నా స్థానిక వలంటీర్లు, సచివాలయ ఉద్యోగుల దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు తమ వంతు సహకారం అందించాలని, చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా కార్మికులకు అందజేయాలని కోరారు. జంగమ, షేక్ కార్పొరేషన్ల డైరెక్టర్లు మీగడ శ్రీనివాస్, అలీఖాన్‌బాబా, వైఎస్సార్ సీపీ అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, కౌన్సిలర్లు శెట్టి కళ్యాణి, పిల్లి శ్రీనివాస్, మారిశెట్టి సత్యనారాయణ, పార్టీ నాయకులు నాగులాపల్లి ఈశ్వరరావు, జొన్నపల్లి సత్తిబాబు, అమలదాసు రుద్రమూర్తి, మొండి మురళి, మున్సిపల్ ఏఈ కేవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- మంత్రి చెల్లుబోయిన వేణు
- గ్రామాల్లో గడపగడపకూ మన ప్రభుత్వం



వృద్ధురాలికి సంక్షేమ పథకాల లబ్ధి పత్రాలను అందిస్తున్న మంత్రి వేణు

కె.గంగవరం: ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మండల పరిధిలోని భట్లపాలిక శివారు గ్రామాలు త్సర్లంపూడి, కావూరివారిపేటల్లో మంగళవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మంత్రి వేణు ప్రతి ఇంటికి వెళ్లి ఆ కుటుంబానికి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను గురించి వివరించి, పత్రాలను పంపిణీ చేశారు. తొలుత వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వారితో మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాలు వివరించి వారి సమస్యలు తెలుసుకుని నమోదు చేసుకోవాలన్నారు. నమోదు చేసుకున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి అందరూ భాగస్వాములై పరిష్కరించాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఏ పథకం అందాలన్నా, సమస్య పరిష్కారం కావాలన్నా అధికారులు, ప్రజాప్రతినిధులు, జన్మభూమి కమిటీల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేదన్నారు. కానీ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఎవ్వరి వద్దకు వెళ్లకుండా ఎవ్వరి రికమండేషన్ లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలు అందుతున్నాయన్నారు.

పారిశుధ్య సమస్య పరిష్కారం

ఇంటింటికి సంక్షేమ పథకాలను వివరిస్తూ వెళుతున్న మంత్రి వేణు కావూరివారిపేట వద్దకు వచ్చేసరికి మంచినీటి పైపులైన్ విడిపోయి ఆ ప్రాంతమంతా అపరిశుభ్రతతో ఉండడాన్ని గమనించారు. వెంటనే పైప్ లైన్ బాగు చేయించాలని అధికారులను ఆదేశించడంతో 10 నిమిషాల్లోని పైప్ లైన్లు జత చేసి పరిష్కారం చూపారు. సర్పంచ్ యలమంచిలి పద్మావతి, సొసైటీ అధ్యక్షుడు మేడిశెట్టి వెంకట రమణ, కోఆప్షన్ సభ్యుడు కడలి విజయదుర్గ, ఎంపీపీ పంపన నాగమణి, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యుడు బత్తుల అప్పారావు పాల్గొన్నారు.

జగనన్న ఆణిముత్యాలకు ఘన సత్కారం



కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను మంగళవారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గుణ్ణం రాజేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు పలని శ్రావ్య మేరీ సత్య, పలని భవ్యశ్రీ, ర్యాలి శంకర తనూజ, గంగుమళ్ల శిరీషలను జెడ్పీటీసీ సభ్యుడు మేర్నీడి వెంకటేశ్వరరావు, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు తాతపూడి ప్రసన్న విజయకుమార్, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, గ్రామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, ఉప సర్పంచ్ పెన్నాడ బుచ్చిరాజు, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ అహ్మద్ అలీషా, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ దొమ్మేటి దుర్గ, సభ్యులు కోటిపలి అబ్బు, నున్న కల్యాణ్, జిల్లా సైన్స్ అధికారి గిరజాల వెంకట సత్యసుబ్రహ్మణ్యం, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శెట్టిబలిజ సంఘం సాయం

కపిలేశ్వరపురం: వివిధ అనారోగ్య కారణాలతో బాధపడుతున్న ఇద్దరికి కపిలేశ్వరపురం మండల శెట్టిబలిజ సేవా సమితి మంగళవారం ఆర్థిక సాయమందించింది. అంగరలో సంఘం మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వాసంశెట్టి వాసు, వనుం పార్థసారథి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సాయం సొమ్మును అందజేశారు. మెదడుకు సంబంధించిన సమస్యతో బాధపడుతున్న మాచర గ్రామానికి చెందిన వాసంశెట్టి మణికంఠకు రూ.8వేలు, డాబాపై నుంచి జారిపడిన ఆలమూరు మండలం సూర్యారావు పేటకు చెందిన వాసంశెట్టి వసంతలక్ష్మికి రూ.7వేలు చొప్పున సాయ మందించారు. నాయకులు మాట్లాడుతూ శెట్టిబలిజ సామాజిక వర్గీయుల అభ్యున్నతికి పాల్పడటంతోపాటు ఆపదలో ఉన్న సమయంలో ఆదుకునే సేవా కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. సంఘం ఉపాధ్యక్షుడు చిట్టూరి నాగేంద్రప్రసాద్, కోశాధికారి శీలం రాంబాబు పాల్గొన్నారు.

వాకింగ్ ట్రాక్‌కు శంకుస్థాపన

రాయవరం: స్థానిక శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులకు ప్రజా ప్రతినిధులు మంగళవారం భూమిపూజ చేశారు. ఎంపీపీ వెంకటరమణ, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ సుబ్బరామారెడ్డి, సర్పంచ్ రామకృష్ణ, ఉప సర్పంచ్ శ్రీను, ఎంపీటీసీ సభ్యురాలు రోజా, పేరెంట్స్ కమిటీ చైర్మన్ నరేంద్రరెడ్డి, హెచ్ఎం శాంతిసునీత పాల్గొన్నారు.

పక్కాగా పాఠ్య ప్రణాళిక



డీవైఈవో శాలెంరాజును సత్కరిస్తున్న హెచ్ఎం దయామణి, ఉపాధ్యాయులు

రాయవరం: ప్రస్తుత విద్యా సంవత్సరంలో పాఠ్య ప్రణాళికను పక్కాగా అమలు చేయాలని రామచంద్రపురం ఉప విద్యాశాఖాధికారి శాలెంరాజు పిలుపునిచ్చారు. మండలంలోని సోమేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా కార్యక్రమాలను సమర్థంగా పాఠశాలల్లో అమలు చేయాలన్నారు. ఏ ఒక్క విద్యార్థికి జగనన్న విద్యా కానుక కిట్ అందక పోయినా ప్రధానోపాధ్యాయులు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. మెర్జింగ్ పాఠశాలల్లో తప్పనసరిగా 3,4,5 తరగతులకు సబ్జెక్టు ఉపాధ్యాయులు బోధన చేయాలన్నారు. విద్యార్థులకు జేవీకే కిట్లు అందాయా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హెచ్ఎం రాయి దయామణి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు డీవైఈవో శాలెంరాజును సత్కరించారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ



విజేతలకు బహుమతులు అందజేస్తున్న పృథ్వీరాజ్

మండపేట: మండలంలోని ద్వారపూడి రాజ్యలక్ష్మి బంగారమ్మ కాలనీలో రెండు వారాలుగా జరుగుతున్న సిద్ధి వినాయక క్రికెట్ టోర్నమెంట్ ముగిసింది. అనపర్తి, బిక్కవోలు, కడియం, రామచంద్రపురం, దొంతమూరు, మాధవరాయుడుపాలెం, యర్రంపాలెం గ్రామాల నుంచి 32 జట్లు పోటీల్లో పాల్గొనగా అనపర్తి జట్టు విజేతగా నిలిచింది. ద్వారపూడి అవినాష్ లెవెన్ టీం రన్నర్స్‌గా నిలిచింది. యర్రపాలెం జట్టు మూడో స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా టోర్నీ నిర్వాహకులు పోతుల దుర్గాప్రసాద్, పల్లా వీరబాబు, సిరిపురపు గణేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బహుమతి ప్రదానోత్సవానికి యువనేత తోట పృథ్వీరాజ్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలను అభినందించారు. గెలుపొందిన జట్టుకు రూ. 25,000, రన్నర్స్‌కు రూ. 12,000, మూడవస్థానంలో నిలచిన జట్టుకు రూ. 6,000 నగదు బహుమతులతో పాటు షీల్డ్‌లను పృథ్వీరాజ్ అందజేశారు. సర్పంచ్ ఈతకోట కిన్నెర, ఉప సర్పంచ్ తులా శేషారావు, ఏఎంసీ మాజీ చైర్మన్ తులా శ్రీరంగారావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పోతుల రాంబాబు, మాజీ ఎంపీపీ అడబాల బాబ్జి, డాక్టర్ ఎస్ఎస్ఆర్ఎస్ నాయుడు, ర్యాలి వీరాంజనేయులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

- ఏడిదలో 10లో ప్రతిభ కనబర్చిన విద్యార్థినికి రూ.రెండు లక్షల బహుమతి



నిఖితకు రూ. రెండు లక్షలు ప్రోత్సాహకం అందజేస్తున్న పురుషోత్తం, అనంతలక్ష్మి దంపతులు

మండపేట: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, క్రమశిక్షణతో చదువుకోవడం ద్వారా ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ప్రముఖ పారిశ్రామికవేత్త నామాల పురుషోత్తం, అనంతలక్ష్మి దంపతులు పేర్కొన్నారు. ఏడిద జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన నర్సిపూడి నిఖిత ఇటీవల 10వ తరగతి పరీక్షల్లో 572 మార్కులతో స్కూల్‌లో ప్రథమ స్థానం సాధించింది. ఈ సందర్భంగా మంగళవారం గ్రామ సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం అధ్యక్షతన పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో నిఖితకు ఉన్నత చదువుల నిమిత్తం రూ.రెండు లక్షలు నగదు ప్రోత్సాహక బహుమతిని పురుషోత్తం దంపతులు అందజేశారు. ఈ సందర్భంగా పురుషోత్తం దంపతులు మాట్లాడుతూ స్కూల్ ఫస్ట్ వచ్చిన విద్యార్థికి రూ. రెండు లక్షలు నగదు బహుమతిని గత ఏడాది నుంచి అందిస్తున్నామన్నారు. అలాగే స్కూల్‌లోని జూనియర్ కళాశాలలో ఇంటర్‌లోను ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థికి రూ. ఐదు లక్షల ప్రోత్సాహక బహుమతి అందజేస్తామని ప్రకటించారు. సర్పంచ్ ఆశీర్వాదం, వైఎస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, రిటైర్డ్ హెచ్ఎం గెడా శ్రీనివాస్, హెచ్ఎం ముంగర వెంకట్రాజు తదితరులు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి పురుషోత్తం దంపతులు అందిస్తున్న తోడ్పాటును కొనియాడారు. గ్రామ ప్రముఖుడు బలుసు వెంకట్రావు, ఆర్‌బీకే మండల కమిటీ డైరెక్టర్ చిలుకూరి బుజ్జి, గుణ్ణం ప్రభాకరరావు, గ్రామ కార్యదర్శి వుండమట్ల వీర్రాజు, పీఈటీ చంద్రమళ్ల బులివీర్రాజు, బూరిగ జానీ, బూరిగ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిపై అవగాహన

కాజులూరు: కుష్ఠు వ్యాధిపై ప్రతీఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని గొల్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఎస్.సౌజన్య అన్నారు. మంగళవారం పీహెచ్‌సీలో ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశ వలంటీర్లకు, సచివాలయ వలంటీర్లకు లెప్రసీ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాలలో ఆశా వలంటీర్లు, సచివాలయ వలంటీర్లు 11 టీములుగా ఏర్పడి ఈ నెల 26 నుంచి జూలై 16 తేదీ వరకూ ఇంటింటా సర్వే నిర్వహించి లెప్రసీ వ్యాధిగ్రస్తులను గుర్తించాలన్నారు.

ఎందరికో యోగం

- సీఎంల నుంచి సామాన్యుల వరకు శిక్షణ ఇచ్చిన వెంకటరెడ్డి
- నేడు అర్తమూరులో సత్కారం



విద్యార్థులతో యోగా సాధన చేయిస్తున్న వెంకటరెడ్డి



వెంకటరెడ్డి అనువదించిన పుస్తకం

మండపేట: ఏపీ యోగాధ్యయన పరిషత్ సెక్రటరీగా, ఇండియన్ యోగా అసోసియేషన్ వ్యవస్థాపక సభ్యుడిగా గవర్నర్లు, సీఎంలు, ఇతర ప్రముఖులు ఎందరికో యోగాలో శిక్షణ ఇచ్చారు. సామాన్య యోగా విధాన క్రమం పుస్తకాన్ని ఆంగ్లం నుంచి తెలుగులోకి అనువదించారు. ఆయనే మేడపాటి వెంకటరెడ్డి. యోగా గురువుగా ఎంతో ఖ్యాతిగాంచిన వెంకటరెడ్డి స్వస్థలం మండపేట మండలం అర్తమూరు అని కొద్ది మందికి మాత్రమే తెలుసు. ఎంతోకాలం క్రితమే ఆయన కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామ సర్పంచ్ గొలుగూరి అన్నపూర్ణ, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు విజయభాస్కరరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో బుధవారం భారీ ఎత్తున ఏర్పాటు చేసిన పౌర సన్మానం కోసం ఆయన గ్రామానికి విచ్చేశారు. కొద్దిసేపు విద్యార్థులతో యోగా సాధన చేయించారు. యోగా ద్వారా వేలాది మందిని ఆరోగ్యవంతమైన జీవనం వైపు నడిపించిన వెంకటరెడ్డిపై ప్రత్యేక కథనం.

1947లో అర్తమూరులో జన్మించిన ఆయన ఆంధ్రా యూనివర్శిటీలో ఎంఏ పూర్తిచేశారు. యోగా పట్ల ఆసక్తితో 1960లో మహారాష్ట్ర లోనావాలాలోని కైవల్యాధాం సంస్థలో పీజీ డిప్లమా చేశారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన రుషీకేశ్‌లోని మహర్షి మహేసుయోగి మెడిటేషన్ ఇనిస్టిట్యూట్‌లో ట్రాన్స్‌డెంటల్ మెడిటేషన్, సైన్స్ ఆఫ్ క్రియేటివ్ ఇంటలిజెన్స్ కోర్సుల్లో శిక్షణ పొందిన తొలి ఆంధ్రునిగా గుర్తింపు పొందారు. 1978లో ప్రారంభించిన ప్రభుత్వ వేమన యోగ పరిశోధనా సంస్థలో సూపర్ వైజర్‌గా, డైరెక్టరుగా 27 ఏళ్ల పాటు సేవలందించి రిటైరయ్యారు. 2005లో ఢిల్లీలోని మొరార్జీ దేశాయ్ జాతీయ యోగా సంస్థ గవర్నింగ్ కౌన్సిల్, స్టాండింగ్ ఫైనాన్స్ కమిటీ, జనరల్ బాడీ సభ్యునిగా సేవలందించారు. 2007లో దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్న సమయంలో ఏపీ యోగాధ్యయన పరిషత్ కార్యదర్శిగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. టీటీడీ ఆధ్వర్యంలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ యోగా అండ్ అలైడ్ సైన్సెస్‌లో కొంతకాలం పనిచేశారు. కైవల్యాధాం కేంద్రంగా 2008లో ప్రారంభించిన ఇండియన్ యోగా అసోసియేషన్ వ్యవస్థాపక సభ్యులు 13 మందిలో వెంకటరెడ్డి ఒకరు.

ముఖ్యమంత్రులకు శిక్షణ

వెంకటరెడ్డి వద్ద పొందిన వేలాదిమందిలో సామాన్యులతో పాటు ఎంతోమంది మంది ప్రముఖులు ఉన్నారు. నాటి గవర్నర్ కృష్ణకాంత్, సీఎంలు మర్రి చెన్నారెడ్డి, కోట్ల విజయభాస్కరరెడ్డి, ఎన్‌టీఆర్‌లతో పాటు ఎంతో మంది మంత్రులు, ఎమ్మెల్యేలతో వెంకటరెడ్డి యోగా సాధన చేయించారు. దేశంలో ప్రసిద్ధి చెందిన ఎనిమిదికి పైగా విశ్వవిద్యాలయాల్లో మూడు దశాబ్దాల పాటు యోగా గురువుగా సేవలనందిస్తూ వచ్చారు. ఇంటి పేర్లపై పరిశోధన చేయడంతో పాటు రచయితగా అర్తమూరు చరిత్రతో పాటు యోగాభ్యసనాలపై పలు పుస్తకాలను రచించారు. తెలుగు రాష్ట్ర ప్రజల కోసం ఆయుష్ విభాగం ముద్రిస్తున్న సామాన్య యోగ విధాన క్రమం పుస్తకం వెంకటరెడ్డి ఆంగ్లం నుంచి తెలుగులోకి అనువదించింది కావడం గమనార్హం.

ఒత్తిడి, ఆందోళన దూరం చేసేది యోగా



ఒత్తిడి, ఆందోళన దూరం చేసి మానసిక వికాసం కలిగించే ప్రాచీన ప్రక్రియ యోగా. ఆరోగ్యం అంటే రోగం లేకపోవడమే కాదు, పరిపూర్ణ, భౌతిక, మానసిక, ఆధ్యాత్మిక వ్యవస్థల సమగ్ర రూపమే ఆరోగ్యం. యోగా సాధనకు కుల మత లింగ విభేదాలు లేవు.

– మేడపాటి వెంకటరెడ్డి, యోగా గురువు